ముఖ్యమంత్రి సభాస్థలి ఖరారు

ఏర్పాట్లు ప్రారంభించిన యంత్రాంగం

విశాలాంధ్ర - భోగాపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి బహిరంగ సభ నిర్వహించే ప్రదేశం ఖరారయ్యింది. మే 3న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి, భోగాపురం మండలం ఎ.రాయవలస-సవరవిల్లి గ్రామాల వద్ద సిఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభను నిర్వహిస్తారు. ఇక్కడినుంచే చింతపల్లి జెట్టీ నిర్మాణం, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులను ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ స్థలాన్ని, సిఎం కార్యక్రమాల సమన్వయ కర్త తలశిల రఘురామ్, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎంఎల్ఏ బడుకొండ అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్, ఎస్పి దీపిక ఆదివారం ఉదయం పరిశీలించారు. సభా వేదిక, విఐపి గ్యాలరీ, హెలీప్యాడ్, పైలాన్ ఏర్పాటు, వాహనాలకు పార్కింగ్ తదితర అంశాలపై చర్చించి ఖరారు చేశారు. హెలీప్యాడ్ కోసం ఏ రాయవలస వద్దనున్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి ఆమోదించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ, ఆర్ అండ్‌బి ఎస్ఈ జయశ్రీ, ఇఇ రమణ, తాశిల్దార్ కోరాడ .శ్రీనివాసరావు, ఎయిర్‌పోర్ట్ భూసేకరణ సమన్వయాధికారి అప్పలనాయుడు, జిఎంఆర్ సిఈఓ మణ్మయ్, ప్రాజెక్టు మేనేజర్ రామరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు తలమానికం : జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు తలమానికమని, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, మే 3న శంకుస్థాపన చేయడం ద్వారా, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కలను ముఖ్యమంత్రి నెరవేర్చనున్నారని అన్నారు. ఇటీవలే శ్రీకాకుళం జిల్లాలో మూలపేట సీ పోర్టుకు సిఎం శంకుస్థాపన చేశారని, విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించారని, ఇప్పుడు జిల్లాలో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయడం ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు.

సభను విజయవంతం చేయాలి : ఎంఎల్ఏ బడ్డుకొండ అప్పలనాయుడు

మే 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శంకుస్థాపన చేయనున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నెల్లిమర్ల ఎంఎల్ఏ బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం కేవలం తమ నియోజకవర్గానికే కాకుండా, ఉత్తరాంధ్ర జిల్లాలకే ఎంతో ప్రతిష్ఠాత్మకమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం భూసేకరణ చేయకుండానే, ఎన్నికల ముందు హడివిడిగా ఉత్తుత్తి శంకుస్థాపన చేసిందని విమర్శించారు. నిర్వాసితులు, నాయకులపై 18 కేసులు నమోదు చేసి, వారిని ఎన్నోరకాలుగా ఇబ్బంది పెట్టిందన్నారు. దాదాపు నాలుగేళ్లపాటు తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసి, భూ సేకరణను పూర్తి చేసి, నిర్వాసితులకు న్యాయం చేసి, వారికి పూర్తిగా పునరావాసం కల్పించిన తరువాతే, శంకుస్థాపన చేస్తున్నామని చెప్పారు.

మోడీ, జగన్‌లను ఇంటికి సాగనంపుదాం

సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర - గజపతినగరం: కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో జగన్‌ని వచ్చే ఎన్నికల్లో సాగనంపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. స్థానిక ఎన్జీఓ హెూంలో ఆదివారం జరిగిన సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ, రాష్ట్రాన్ని పాలిస్తున్న వైసీపీ పార్టీలను ఇంటికి సాగనంపాలని అన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ ప్రజలపై మోయలేని భారాలను మోపుతోందన్నారు. అదాని అంబానీ లాంటి బడా కంపెనీ యజమానులకు ప్రజా సంపదను కట్టబెడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గం విషయానికి వస్తే ఇక్కడ శాసనసభ్యులు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ బీజేపీ పార్టీ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోందని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పక్కతోవ పట్టించి అంబానీ లాంటి కంపెనీలకు ప్రజా సంపదను కట్టబెడుతున్నారని అన్నారు. ప్రభుత్వ కంపెనీలు, ప్రభుత్వ సంస్థలను వారు చౌకగా వారికి కట్టబెడుతున్నారని అన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కోడ్లు తెచ్చారని అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. తక్షణమే మోడీ, జగన్‌లను ఇంటికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్, సీపీఎం మెంటాడ మండల కార్యదర్శి రాకోటి రాములు, సీపీఐ నాయకులు గేదెల రామనాయుడు, నూకరాజు, గురువులు, కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

పంట కాలువను మట్టితో కప్పేస్తున్న స్థానికుడు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామం లోని కోమటి చెరువు క్రింద గల కాలువ నుంచి సుమారు 50 మంది రైతులకు నీరు వెళ్లే పంట కాలువను ముల్లువలస ప్రదీప్ కుమార్ అనే వ్యక్తి మట్టితో కపివేస్తున్నాడని, వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై రైతు అల్లు రవి రామకృష్ణ (కిట్టు) స్థానిక విలే కరులతో ఆదివారం మాట్లాడారు. ఇప్పటికే కోమటి చెరువు కింద గల ప్రభు త్వ పంట కాలువను ఒక వ్యక్తి మట్టి వేసి కప్పేస్తున్నాడని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందన కార్యక్రమంలో రెవెన్యూ అధికారులకు, వీఆర్వోకు ఇటీవల ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు పంట కాలువను కప్పేసేందుకు వేస్తున్న మట్టిని తొలగించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : అక్షయ తృతీయ సందర్భంగా శృంగవరపుకోట పుణ్యగిరి మార్గంలో ఉన్న శ్రీ సూర్యదేవా లయంలో ఆలయ ప్రధాన అర్చకుడు విన్నకోట సూర్యనారాయణమూర్తి (సూరిబాబు) ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయానికి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివారికి మొక్కలు, పెసలు విసిరి మొక్కులు చెల్లించుకుని స్వామివారికి పూజలుచేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శంకరరావు, బ్రాహ్మణ సంక్షేమ సంఘ అధ్యక్షుడు జి.సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కామాక్షి నగర్, అయ్యన్న పేట జంక్షన్ వద్ద ఎస్సీ, బీసీ కాలనీలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, విజయనగరం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు త్యాడ రామకృష్ణారావు (బాలు) మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ - 102 గవర్నర్ కర్రోతు సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో దాహార్తిని ప్రజలకు తీర్చడం వెలకట్టలేని పుణ్యకార్యమని, స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ క్లబ్‌లు ఇటువంటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉపయోగ పడాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బాలు, క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు మాస్టారు, క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు, క్లబ్ ఉపాధ్యక్షుడు పిడుగు సతీష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి లోపింటి కళ్యాణ్, డిస్ట్రిక్ట్ 102 క్యాబినెట్ కార్యదర్శి త్యాడ చిరంజీవి రావు, క్యాబినెట్ కోశాధికారి కె.వి.రమణ మూర్తి, డిప్యూటీ గవర్నర్ ఈపు విజయ్ కుమార్ మాస్టారు,శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు (సి.హెచ్.రమణ) ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పప్పు విశ్వనాథం, తోషిని వాలా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డి.సన్యాసిరాజు, శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ సభ్యులు వై.నలమారాజు, శ్రీనివాస్ మాస్టారు, పైడయ్య, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక కోట వద్ద పదవ తరగతి స్పాట్ కేంద్రం వద్ద ఆదివారం సాయంత్రం నాలుగు నుండి ఐదు గంటల వరకు ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు టి.సన్యాసిరాజు అధ్యక్షతన నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఉపాధ్యాయులు సస్పెన్షన్ తక్షణమే ఎత్తివేయాలని, అలాగే బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి మినహాయింపు ఉండాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ 1938 నాయకులు ఈశ్వర్రావు, యుటిఎఫ్ డి రాము ,ఎస్.టి.యూ డి.శ్యామ్, ఏ పి టి ఎఫ్ 256 షేక్ బుకరి బాబు, పి ఆర్ టి యు వి.రామావతారం, ఏటి ఏ అమర్నాథ్, పిఆర్టియు డెమోక్రటిక్ కంది రమణ,యు.టి. ఆఫ్.ఈశ్వరరావు, రమేష్ పట్నాయక్ ,అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల నుండి అక్రమ వసూళ్లు తగదు

విశాలాంధ్ర - బొబ్బిలి : ఉపాధి కూలీల నుండి అక్ర మంగా డబ్బులు వసూలు చేసిన ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న డిమాండ్ చేశారు. ఆదివారం బొబ్బిలి సీపీఐ ఆఫీసు వద్ద విలేకరులతో మాట్లాడారు. ని యోజకవర్గ పరిధిలో బాడంగి మండలం వాడాడ గ్రామంలో ఉపాధి హామీ కూలీల నుండి మేట్లు ఒక్కొక్కరి వద్ద 200 చొప్పున అక్రమంగా వసూలు చేశారని, 200 ఇవ్వని కూలీలను పనులకు రావద్దని బెదిరిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై బాడంగి ఏపీఓ స్పందించి లబ్ధిదారుల దగ్గర ఎటువంటి డబ్బులు అక్రమంగా వసూలు చేయలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉపాధి కూలీల దగ్గర వసూలు చేసిన డబ్బులు రికవరీ చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని లేనివక్షంలో దశలవారి పోరాటాలు చేస్తామని అన్నారు. ఉపాధి కూలీలను భయపెట్టి మా వద్ద ఎవరూ డబ్బులు వసూలు చేయలేదని లబ్ధిదారులతో ఏపీఓ చెప్పించినంతమాత్రాన నిజం అబద్ధం అయిపోదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, ఎం. సూర్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో తెర్లాం శాఖ గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి మాట్లాడుతూ పుస్తకం చదవడం ద్వారా మానసిక ఉల్లాసం, ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులచే జీవిత చరిత్రలు, బాల మిత్రకథలు, నీతికదలు, విద్యార్థులకు కావలసిన క్లాసు పుస్తకాలు చదివించినట్టు తెలిపారు.

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం: సీపీఐ

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండలంలో ఆర్.వెంకంపేట గ్రామంలో సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా మోడీ హటావో, దేశ్ బచావో కార్యక్రమాలలో ప్రజలు యావన్మంది పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న పిలుపునిచ్చారు. మక్కువ మండలం ఆర్.వెంకంపేట గ్రామంలో జిల్లా సమితి సభ్యులు బీటీ నాయుడుతో కలిసి రెండవ రోజు ప్రచార బేరి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద పాలనను గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఇటువంటి పరిస్థితుల్లో దేశంలో, రాష్ట్రంలో అలుముకుంటున్న చీకట్ల నుండి బయటపడడానికి ప్రజానీకమే ఉవ్వెత్తున కదిలి ఉద్యమించాలని అన్నారు. రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు కూడా మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడం లేదని, నిన్న విశాఖ ఉక్కుపై కేంద్ర మంత్రి ప్రయివేటికరణ లేదని చెప్పి ఢిల్లీ వెళ్లి ఇంకో మాట చెప్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బీటీ నాయుడు, ప్రసాద్, మోహనరావు, సుబ్బి, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా శివున్నాయుడు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మండలంలోని పెద బొండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా వెంకంపేట గ్రామానికి చెందిన తీళ్ళ శివున్నాయుడు నియమితుల య్యారు. ఆదివారం స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావు ఆధ్వర్యంలో పీఏసీఎస్ ఆవరణలో ఆయన బాధ్యతలను స్వీకరించారు. పీఏసీఎస్ చైర్మన్‌గా నియామకం కాబడిన శివున్నాయుడుకు ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బాలగరేవతమ్మ, వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మరడాన భాగ్యశ్రీ, వైస్ చైర్మన్ వానపల్లి శంకరరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేష్, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వెంపలి గురురాజు అభినందనలు తెలిపారు.

నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు పంపిణీ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: మండలంలోని అడ్డాపుశీల పంచాయతీ పిన్నింటి రామి నాయుడు వలస గ్రామానికి చెందిన తోటపల్లి రిజర్వాయర్ నిర్వాసితులకు దశాబ్దన్న రకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల పట్టాల పంపిణీ స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో వాస్తవ రూపం దాల్చింది. పిఎస్ఆర్ గ్రామానికి చెందిన 28 మంది లబ్ధిదారులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద పంచాయతీ పరిధిలో ఇళ్ల పట్టాలను ప్రభుత్వం మంజూరు చేయగా ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు లాటరీ విధానంలో ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. ఇంకా అర్హులు ఎవరైనా మిగిలి ఉంటే వారందరికీ కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నిర్వా సితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ ఎస్.కృష్ణ, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, సీనియర్ నాయకులు బలగ నాగేశ్వరరావు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత త్రివిధ దళాలలో చేరాలి

ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

విశాలాంధ్ర - బెలగాం: యువత త్రివిధ దళాలలో చేరాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. బెలగాంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బెలగాంలో ఏర్పరచిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యో గస్తుల సంఘ నాయకులతో వివిధ విషయాలపై చర్చించారు. ముందుగా దేశ సేవలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులను నిర్వహించిన సైనికుల త్యాగాలను ఒక మారు గుర్తు చేసుకొని వారికి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా నలుమూలల చుట్టుప్రక్కల గ్రామాలలో సుమారుగా 1000 మంది పై చిలుకు దేశ సేవలో నిమగ్నమవ్వడం చాలా గర్వించదగ్గ విషయమని అన్నారు. అదేవిధంగా నేటి యువత కూడా దేశ సేవ కోసం త్రివిధ దళా లలో చేరేందుకు ఆకర్షితులయ్యే విధంగా యువతకు ప్రేరణగా నిలవాలని, నిరుద్యోగ యువతకు త్రివిధ దళాలలో చేరేందుకు అవసరమైన శిక్షణను, నైపుణ్యాన్ని మాజీ సైనికోద్యోగులుగా సూచనలు అందించి ఈ ప్రాంతం యొక్క పేరు ప్రఖ్యాతలు దేశ నలుమూలలా విస్తరింప చేసే విధంగా సహకరించాలని కోరారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న ప్రతీ కళాశాలలో చదువుకుంటున్న యువతకు ప్రత్యేకంగా కళాశాలలకు వెళ్లి వారికి దేశ సేవ కొరకు ఉన్నటువంటి అవకాశాలపై అవగాహన కల్పించాలన్నారు. దేశ సేవ కొరకు వారు ముందుకు వచ్చే విధంగా తయారు చేసి తద్వారా యువతకు ఆదర్శంగా నిలుస్తూ అవసరమైన ప్రోత్సాహాన్ని అందివ్వాలని అన్నారు. ఇటీవల దివంగతులైన చినబొండపల్లి గ్రామానికి చెందిన నాయుడు గవరయ్య గృహానికి మాజీ సైనిక సంఘ ప్రతినిధులతో వెళ్లి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు రంగుముద్రి శివ, నరేన్ నాయుడు, మాజీ సైనికుల సంక్షేమ సంఘ సభ్యులు అధ్యక్షులు చంద్రశేఖర్, క్రిష్ణ, ఈశ్వరరావు, తాడ్డి రమేష్, కైలాసరావు సంఘ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్‌లు వెంటనే రద్దు చేయాలి

ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి డిమాండ్

విశాలాంధ్ర-పాలకొండ: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ పార్వతీపురం మన్యం జిల్లాలో డిఇఓ, ఎంఈఓ, జిసిడిఓ మరియు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ల అక్రమ సస్పెన్షన్లను వెంటనే రద్దు చేసి వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మన్యం జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఇచ్చిన పిలుపునిచ్చిందని, పాలకొండ మండల పరిధిలోగల అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులంతా సోమవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు అవ్వాలని అలాగే జిల్లా కేంద్రంలో సాయంత్రం నాలుగు గంటలకు డీఈవో కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు జరిగే ర్యాలీలో పాల్గొనాలని పాలకొండ మండల ఏపీటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాసుదేవరావు, సంపత్ కుమార్ జిల్లా ఉపాధ్యక్షులు బి.వి రమణ, జిల్లా కార్యదర్శులు ఉమామహేశ్వరరావు పద్మజ రాష్ట్ర కౌన్సిలర్ జి సూర్యనారాయణ జిల్లా ఎడిట్ కమిటీ కన్వీనర్ శ్రీరాములనాయుడు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు నాగరాజు, విజయలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు.

అంబేద్కర్ గురుకులాల ప్రవేశ పరీక్షకు అనూహ్య స్పందన

విశాలాంధ్ర - సీతానగరం: డాక్టరు బిఆర్ అంబేద్కర్ గురుకులాలలో 5వ తరగతి, ఇంటర్ మొదట సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించి ఆదివారం జోగమ్మపేట గురుకులంలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు అనూహ్య స్పందన వచ్చిందని, పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జోగమ్మపేట గురుకులం ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు తెలిపారు. 5వ తరగతి ప్రవేశపరీక్ష ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12.30 గంటల వరకు జరగ్గా, ఇంటర్ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగిందన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 317మంది విద్యార్థులకు గాను

278 మంది హాజరు కాగా, 39 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. ఇంటర్ ప్రవేశ పరీక్షకు 189 మంది విద్యార్థులకు గాను 152 మంది పరీక్షలకు హాజరు కాగా, 37 మంది గైర్హాజరు అయ్యారని చెప్పారు. రాష్ట్ర, జిల్లా అధికారులు జిల్లా కో ఆర్డినేటర్ చంద్రావతి ఆదేశాలు, సూచనలు మేరకు పరీక్షను పకడ్బందీగా నిర్వహించినట్లు చెప్పారు. ఈ ప్రవేశ పరీక్షలో ర్యాంకులను బట్టి జిల్లాలోని గురుకులాల్లో సీట్లు కేటాయించడం జరుగు తోందని తెలిపారు. పరీక్షలు ముగిశాక విజయనగరం ప్రత్యేక వాహనంలో తరలించామని చెప్పారు.

14 గ్రామ పంచాయతీలకు ర్యాంకులు

విశాలాంధ్ర - పార్వతీపురం/సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో ఉత్తమ గ్రామ పంచాయతీలను ప్రకటించగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన 14 గ్రామ పంచాయతీలు వివిధ విభాగాల్లో ర్యాంకులు దక్కించుకున్నాయని జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ తెలిపారు. తొమ్మిది విభాగాలు (థీమ్ లలో)లో ర్యాంకులు ప్రకటించారని ఆయన చెప్పారు. ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఈ ర్యాంకులను ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. పేదరికంలేని, మెరుగైన జీవనోపాధుల గ్రామం విభాగంలో పార్వతిపురం మండలం చినబొండపల్లి గ్రామపంచాయితీకి రెండవ ర్యాంక్ దక్కిందన్నారు. ఆరోగ్యవంతమైన గ్రామ పంచాయతీగా విభాగంలో గుమ్మలక్ష్మీపురానికి మొదటిర్యాంక్, నీటిసమృద్ధి గల గ్రామం విభాగంలో పాలకొండ మండలం వెలగవాడ గ్రామ పంచాయతీ, సీతానగరం మండలం జోగింపేట గ్రామపంచాయతీకి మొదటి ర్యాంక్ లభించిందని తెలిపారు. పరిశుభ్రమైన హరిత గ్రామం విభాగంలో సీతానగరం మండలం జోగింపేటగ్రామ పంచాయతీకి మూడవ ర్యాంక్ లభించిందని తెలిపారు. స్వయం సమృద్ధి ఉన్న మౌలిక సదుపాయాలు కలిగిన గ్రామం విభాగం లో కురుపాం మండలం పెద్దసొత్తిలి గ్రామపంచాయతీకి మొదటి ర్యాంక్, గురుగుబిల్లి మండలంలోని గురుగుబిల్లి గ్రామ పంచాయతీకి రెండవ ర్యాంక్ దక్కిందన్నారు. సామాజికంగా సురక్షితమైన గ్రామం విభాగంలో గరుగుబిల్లి మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ మొదటి ర్యాంక్ దక్కించుకుందన్నారు. సుపరిపాలన కలిగిన గ్రామం విభాగంలో బలిజిపేట మండలం మిర్తివలస గ్రామపంచాయతీకి మొదటి ర్యాంక్, సీతానగరం మండలం జోగింపేట గ్రామపంచాయతీకీ రెండవ ర్యాంక్, బలిజిపేట మండలం పెదపెంకి గ్రామ పంచాయతీకి మూడవ ర్యాంక్ లభించిందని తెలిపారు. లింగ సమానత్వంతో మరింతగా గ్రామాభివృద్ధి విభాగంలో సీతానగరం మండలం జాను మల్లువలస గ్రామపంచాయతీ రెండవ ర్యాంకును, సీతానగరం మండలం దయానిదిపురం గ్రామపంచాయతీ, సీతంపేట మండలం సీతంపేట గ్రామపంచాయతీ మూడవ ర్యాంక్ లు దక్కించుకున్నాయన్నారు. జిల్లాలో 14 గ్రామపంచాయితీలు ర్యాంకులు సాధించడం పట్ల జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అభినందించారని తెలిపారు. సీతానగరం మండలంలోని మూడు గ్రామ పంచాయతీలు ఉత్తమ ర్యాంకులు సాధించడం పట్ల ఎంపిడిఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపిఆర్డీ కుమార్ వర్మలు హర్షం వ్యక్తం చేశారు.

ఆంగ్లభాషా నైపుణ్యం అందరికీ అవసరం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ప్రస్తుత ప్రపంచంలో ఆంగ్లభాషా నైపుణ్యాలు అందరికీ అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ప్రపంచ ఆంగ్ల భాష దినోత్సవం కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో ఆంగ్ల భాషా నైపుణ్యాలు ప్రతీ ఒక్కరికీ అవసరమని, ప్రపంచంలో అధిక సంఖ్యలో మాట్లాడే భాష మాండారిన్ అయినప్పటికీ అది కేవలం చైనా ఒక్క దేశానికే పరిమితం అని, ఆంగ్లభాష మాత్రం ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలలో విస్తరించి ఉందన్నారు. వైస్ ప్రిన్సిపల్ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ సాధనలో విజయం సాధించడంలో ఆంగ్ల భాషకున్న ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వాసుదేవరావు, ఈరన్న, భాస్కర్, వలీ ఖాన్, శ్రీలక్ష్మి, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మన్యం జిల్లాలో ఎస్టీ కమిషన్ పర్యటించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో రాష్ట్ర ఎస్టీ కమీషన్ పర్యటన చేయాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం తరుపున కోరుతున్నట్లు ఆయా సంఘాల నాయకులు కోరారు. ఎస్టీ కమీషన్ ఏర్పాటు తరువాత ఇంతవరకు పార్వతీపురం ఐటీడీఏలో పర్యటన చేయలేదన్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యం చేయబడిందని, ఐటీడీఏ పాలక వర్గ సమావేశంలేదు, గిరిజన సంక్షేమం, అభివృద్ధిపై చర్చ లేదన్నారు. ఐటీడీఏ స్పందనలో పీఓ ఉండే పరిస్థితి లేదని, గిరిజన సంక్షేమ నిధులు మళ్లింపులు జరుగుతున్న పట్టించుకునే ప్రజా ప్రతినిధులు లేరన్నారు. ఇటువంటి అనేక అంశాలపై ఎస్టీ కమీషన్ స్పందించాల్సిన అవసరం ఉందని, కావున మన్యం జిల్లా పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఎస్టీ కమీషన్ పర్యటన చేయాలని కోరుతున్నట్లు నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్,ఉర్లక నాగార్జున, ఆరిక ప్రభాకరరావులు తెలిపారు.

బెవరపేటలో జనసేన కార్యకర్తలపై దాడి అమానుషం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: చీపురపల్లి నియోజకవర్గంలో బెవరపేటలో జన సేన కార్యకర్తలపై దాడి అమానుషమని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. పార్టీ అండగా వుంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ జగనన్న భవిష్యత్తు స్టిక్కర్లు అంటించొద్దు అన్నందుకు జన సేన కార్యకర్తలపై వైసీపీ నేతలు దాడులు చేయడం అమానుషమన్నారు. అధికార పార్టీ నాయకులు దాడులకు తెగబడి ప్రాణాలు హరించాలని చూడటం దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, దాడిచేసిన వారి పై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదాడ మోహన్ రావు, రాజేంద్ర, ఎంటి రాజేష్, భార్గవ్, ఎమ్ .పవన్ కుమార్, సురేష్ , వంశీ తదితరులు పాల్గొన్నారు.

అనుమానంతో భార్య, కూతురుపై దాడి

విశాలాంధ్ర - బెలగాం: భార్యపై అనుమానంతో దాడిచేయడంతో భార్యతోపాటు కూతురికి గాయాలైన సంఘటన శనివారం రాత్రి జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బలిజపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన సింగరాపు రవణమ్మ కూలి పని చేసుకొని జీవిస్తుంది. పెళ్లయి 21సం.లు అయింది ఇద్దరు పిల్లలు. భర్త సింగారపు శ్రీనుకు కుమార్తె పుట్టినప్పటి నుండి ఆమెపై అనుమానం పెట్టుకున్నాడు. ఈ అమ్మాయి తనకు పుట్టలేదని అక్రమ సంతానమని అనుమానిస్తున్నాడు. ఈ అనుమానంతో తరచూ తిడుతూ, కొడుతూ ఉన్నాడు. ఈ మధ్య ఎక్కువగా కొడుతున్నాడు. ఈక్రమంలో శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంట్లో మంచంపై కుమార్తె స్నేహతో కలసి రవణమ్మ నిద్రిస్తుండగా భర్త శ్రీను వచ్చి మంచం దండితో వెంటబడి మరీ కొట్టాడు. అడ్డువచ్చిన కూతురు స్నేహను కూడా కొట్టాడు. ఈసంఘటనలో తల్లికూతురుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ బలిజిపేట పి.హెచ్.సికి తీసుకొని వెళ్లగా అక్కడి వైద్యులు ప్రధమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి 108 వాహనం ద్వారా తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు.

జగనన్నే మా భవిష్యత్తులో

రాష్ట్రస్థాయిలో పార్వతీపురం ముందంజ

విశాలాంధ్ర - పార్వతీపురం: జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమం నిర్వహణలో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో పార్వతీపురం నియోజకవర్గం మొదటి స్థానాన్ని దక్కించుకోవడం పట్ల నియోజక వర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కన్వీనర్లు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు అభినందనలతో ముంచెత్తుతున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావుసారధ్యంలో ఏప్రిల్ 7న ప్రారంభమైన "జగనన్నే మా భవిష్యత్తు" ప్రచార కార్యక్రమం ఎండనక వాననక లెక్క చేయక రెండు వారాలు పూర్తి కావస్తున్నా తరుణంలో పార్టీ అధిష్టానం అందించిన సమాచారం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గల 175 నియోజకవర్గాలలో ఈకార్యక్రమం నిర్వహణలో రాష్ట్రంలో ప్రథమస్థానంలో పార్వతీపురం నియోజకవర్గం నిలవడం జరిగిందని ఎమ్మెల్యేకు రాష్ట్ర పార్టీ చెప్పడం అందరిలో ఉత్సాహం మరింత పెరిగిందని నాయకులు చెబుతున్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ, వార్డులలోను కార్యక్రమాన్ని ప్రజల మధ్యకు తీసుకువెళ్లి నూటికి నూరు శాతం విజయవంతం చేసిన నియోజక వర్గ ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, సచివాలయంల కన్వీనర్లకు, గృహ సారథులకు, వాలంటీర్లకు, అభిమానులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈకార్యక్రమం పూర్తిచేసిన సచివాలయాల్లో ప్రభుత్వము మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. రెండింటిలోను పార్వతీపురం ఎమ్మెల్యే జోగారావు ముందంజలో ఉండటంపట్ల మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, మండల కన్వీనర్ యూ సురేష్ , సోషల్ మీడియా కన్వీనర్ శివతోపాటు జిల్లా వ్యవసాయసలహామండలి ఛైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, ఎంపిపి బలగ శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ బాబ్జి, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పోల ఈశ్వరనారాయణ, మాజీ సిడిసి ఛైర్మన్ నడిమింటి రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీలు అంబటి కృష్ణంనాయుడు, తెంటు వెంకట అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కొట్నానరత్నాకర్, మండల వైఎస్ఆర్సీపీ నేతలు ఆర్వీ పార్థసారథి, మజ్రాపు ధనం, గాజాపు శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, ఎంపిటిసిలు బురిడి సూర్యనారాయణ, సురగాల కిరణ్ కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

మూడోరోజు కొనసాగిన యూఎస్‌పీఎస్ నిరసన

విశాలాంధ్ర - పార్వతీపురం: మన్యం జిల్లా డిఇఓ డాక్టరు ఎస్‌డివి రమణ, మరో ఆరుగురు ఉద్యోగులపై రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ విధించిన సస్పెండ్ ఉత్తర్వులను తక్షణమే రద్దుచేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు మూడోరోజు ఆదివారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యు ఎస్ పి ఎస్) పేరిట నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహాత్మగాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని వినమ్రంగా అందజేసి నిరసనను తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలోని అత్యున్నత అధికారి తన సంస్థలోని లోపాలను సవరించుకొని సంస్థను అభివృద్ధి పదంలోకి నడపడానికి కావల్సింది ఆలోచన గాని ఆవేశం కాదని తెలియజేస్తూ గాంధీ విగ్రహానికి ఇచ్చిన వినతిపత్రంలో తెలిపారు. అనంతరం తక్షణమే సస్పెండ్ చేసిన జిల్లా విద్యాశాఖాధికారితోపాటు వీరఘట్టం ఎంఇఓ పి.కృష్ణమూర్తి, జిల్లా అసిస్టెంట్ గర్ల్ చైల్డ్ డెవలప్ మెంట్ ఆఫీసర్ రోజారమణి, కెజిబివిప్రిన్సిపాల్ రోహిణి, సీతమ్మపేట ఎంఈఓ ఆనందరావు,మక్రిపాడు ఎంపీపీ పాఠశాల హెచ్ఎం రామినాయుడు, భామిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు రాంబాబుల సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దుచేయాలని గాంధీ విగ్రహ కూడలివద్ద నినాదాలు పెద్ద ఎత్తున చేశారు. ఈనిరసన కార్యక్రమంలో పి ఆర్ టి యు, ఏపీటిఎఫ్, యుటిఎఫ్, ఎస్సీ ఎస్టీ సంఘం, వైఎస్సార్ టీచర్స్ యూనియన్ తదితర సంఘాలకు చెందిన నాయకులు అమరాపు సూర్యనారాయణ, వోలేటి తవిటినాయుడు, కాగాన విజయ్, నల్ల బాలకృష్ణ, బంకురు జోగినాయుడు, రావాడ అప్పలనాయుడు, సుర్ల మురళీ మోహన్, తోట రమేష్, సిహెచ్ శ్రీనివాసరావు, నీరస శ్రీనివాసరావు, సామల సింహాచలం, రాగాల శ్రీనివాస రావు, స్కూల్ అసిస్టెంటుల సంఘం నేత ఉత్తరావిల్లి గోవిందరావు, పిఈటి సంఘంనేత దామినేని గాంధీ తదితర సంఘాలనేతలు, వివిధ మండలాలబాధ్యులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం 4గంటలకు మన్యం జిల్లాకేంద్రంలో బారీ ర్యాలీ నిర్వహణతోపాటు జిల్లా కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తామని నాయకులు, ఉపాధ్యాయులు తెలిపారు. మంగళవారం పార్వతీపురం, కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలతో పాటు డిప్యూటీ సిఎం రాజన్నదొరకు వినతి పత్రాలు కూడా అందజేస్తామని తెలిపారు. అప్పటికే సమస్య పరిష్కారం జరగక పోతే మంగళవారం తరువాత కార్యాచరణను ప్రకటిస్తామని నాయకులు తెలిపారు.

ప్రభుత్వ చేతగానితనంతో ఆర్థిక విధ్వంసం

విశాలాంధ్ర - జామి: రాష్ట్రంలో పరిపాలన చేతకానితనంతో నేడు రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరుగుతోందని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోపించారు. ఆదివారం మండలంలోని జాగరం, రామయ్యపాలెం గ్రామాలలో 'ఇదేం కర్మ రా బాబు మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆమె పర్యటించి ప్రజలకు గత ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. అలాగే ఈ ప్రభుత్వంలో ప్రజలు ఆర్థికంగా ఎంత ఇబ్బందులు పడుతున్నారో తెలియజేశారు. పరిపాలన చేతకాని వైసీపీ ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లలో నిత్యావసరాల సరుకులైన నూనెలు, పప్పులు ధరలను ఆకాశాన్ని అంటే విధంగా, ప్రతీ మధ్యతరగతి సామాన్యులు గానీ, రోజువారీ కూలీ వాడు గానీ, నిరుపేదవాడు గానీ సరిగ్గా కొనుకొని తినే పరిస్థితి నేడు ఆంధ్ర రాష్ట్రములో కనిపించడం లేదన్నారు. అదేవిధంగా ఏడుసార్లు కరెంట్ బిల్లును పెంచడం జరిగిందని, తెలుగుదేశం పార్టీ హయాంలో 600 ఉంటే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వంట గ్యాస్‌ను 1100-1200 చేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వనరులను, ఆర్థిక సంపదను కాపాడకుండా, తమ స్వప్రయోజనాల కోసం వైసీపీ ప్రభుత్వం వాడుకుంటుందని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు అందరూ గమనిస్తూనే ఉన్నారని, ప్రజాభిప్రాయాన్ని తగిన సమయంలో వైసీపీ ప్రభుత్వంనకు చెబుతారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వర్రి రమణ, విశాఖపట్నం పార్టీ మహిళా కార్యదర్శి మాకిరెడ్డి శ్రీలక్ష్మి, సీనియర్ నేతలు గనివాడ ఎర్నాయుడు, తానవరం చంద్రావు, జాగరం దేవుడు నాయుడు, బొడ్డకా యల గాంధీ పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమకారుడు

మలిచర్ల దుర్గారావుకు ఘన నివాళులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆదివారం స్థానిక దాసన్నపేటలో దశకర్మ సందర్భంగా బీసీ సంఘం నాయకులు, రజక సంఘ నాయకులు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, మాట్లాడుతూ జిల్లాలో పేదల పక్షాన, ఎస్సీ ,ఎస్టీ ,బీసీలు పక్షాన, రజకుల పక్షాన, పోరాటం చేసిన మహా వ్యక్తి మలిచర్ల దుర్గారావు అని కొనియాడారు. సమస్య ఎక్కడ ఉంటుందో మలిచర్ల దుర్గారావు అక్కడ ఉండేవాడిని అన్నారు. ఎంతోమంది పేదల కోసం ఇల్లు ఇప్పించడంలోనూ, రేషన్ కార్డులు మంజూరు లోనూ, పెన్షన్ మంజూరు లోనూ, సామాజిక వివక్షత జరిగేటప్పుడు ముందు నిలిచి న్యాయం జరిగేటట్టు పోరాటం చేసి విజయ సాధించారు అని అన్నారు. ఇలాంటి నాయకుడిని ప్రజలు గుర్తు ఉంచుకుంటారని తెలిపారు. రజక సంఘం నాయకులు తంగేడు భాస్కరావు మాట్లాడుతూ మలిచర్ల దుర్గారావు రజక కులానికి ఎన్నో సేవలు అందించారని అన్నారు. రజకుల ఆత్మగౌరవానికి ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. రజకులు పై జరిగే ఎన్నో దాడులను ఎదుర్కొన్నారని తెలిపారు. సామాజిక వివక్షత కోసం వ్యతిరేకంగా పోరాటం చేసిన ఒక మహా నాయకుడిని రజక సంఘం కోల్పోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణం, ఉపాధ్యక్షులు రామేశ్వర రామారావు, రెడ్డి సంఘం నాయకులు పందిరి లక్ష్మారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు టీవీ దుర్గారావు, దిమిలి పైడిరాజు, అభివృద్ధి వేదిక నాయకులు షణ్ముఖరావు, ఈఎస్ఎం రాజు, గండేటి శ్రీనివాసరావు, రజక సంఘం నాయకులు కెల్ల సత్యం ,సత్యనారాయణ, చిన్నారావు, కుటుంబ సభ్యులు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర - రేగిడి : సంతకవిటి మండలంలోని మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతియ పుస్తక దినోత్సవం, ఇంగ్లీష్ భాష దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వాహించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత ఆంగ్ల రచయితలు, విలియం షేక్స్పియర్ , సరోజిని నాయుడు, ఆర్ .కే. నారయణ చిత్రపటాలకు పూల మాల వేసి ఇంగ్లిషు భాష అభివృద్ధికి వారు అందించిన తోడ్పాటు ను ఆంగ్ల. ఉపద్యా యులు అదపాక దామోదర రావు వివరించారు. సేక్షేప్పియర్ సుమారు ఒక వెయ్యి నూతన పదజాలం అందించారని, అతని నాటకాలు సమాజాన్నీ ప్రభావితం చే సాయిని. ప్రతి విద్యార్థీ ఆంగ్ల భాష ను నెర్చుకోవాలిని .ఆంగ్ల పుస్తకాలు చదవాలిని ,పుస్తక పఠనం తో ఆనందం,అభివృద్ధి ఉజ్వల భవిష్యత్ ఉంటాయి తెలిపారు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు దాసరి కృష్ణా రావు, రాస్ట్రా ఉత్తమ ఉపాధ్యయ అవార్డ్ గ్రహీత అదపాక దామోదర రావు, ఉపాధ్యాయులు వవిలపల్లి వెంకట రమణ,సత్యారావు, విద్యార్థులు పాల్గొన్నారు

గిరిజన వృద్ధులకు పాదరక్షలు పంపిణీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శ్రీ సత్యసాయిబాబా వారి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా మూలబొడ్డవర పంచాయతీ పరిధి మూలబొడ్డవర, మరుపల్లి, లచ్చుందొరపాలెం గిరిజన గ్రామాల్లో ముగ్గురు గర్భిణీలకు ఎస్.కోట సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు సీమంతం చేయడంతో పాటు 100 మంది వృద్దులకు పాదరక్షలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యుడు డాక్టర్ ఆర్.త్రినాథరావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - సీతానగరం: నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని తామరఖండి గ్రామంలో ఉచిత మెగావైద్య సేవా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మూడడ్ల లలితవెంకటనాయుడు తెలిపారు. వివిధ రకాలైన రోగనిర్ధారణ పరీక్షలు చేయబడతాయని, వివిధ స్పెషలిస్టు డాక్టర్లు వచ్చి తనిఖీలు చేస్తారని తెలిపారు. రోగులు, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు ఉచిత మెగా వైద్య సేవా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓ మంచి పుస్తకం కొనుక్కో

రోటరీ అధ్యక్షులు జేసీ రాజు

విశాలాంధ్ర - బొబ్బిలి: చిరిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ మంచి పుస్తకం కొనుక్కో అని కందుకూరి వీరిశిలింగం చెప్పిన మాటలు ప్రతివిద్యార్థి అమలు చేయాలని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు నారాయనప్పవలస పాఠశాల ప్రదసనోపాధ్యాయులు జె

సి రాజు పిలుపునిచ్చారు. ఆదివారం పాఠశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవ సందర్భంగా వివిధ రకాల పుస్తకాలతో ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ పుస్తకాలను చదవటం అలవాటు చేసుకోవాలని చదవటాన్ని ప్రేమించాలన్నారు. పుస్తక పఠనం వల్ల మనసు ప్రశాంతంగా వుంటున్నదని అన్నారు.

ప్రకృతి సేద్యం రైతు పెంకికి సత్కారం

విశాలాంధ్ర - వంగర: ప్రకృతి సేద్యం చేస్తూ నలుగురికీ ఆదర్శంగా నిలిచిన మండలంలో కె.కొత్తవలస గ్రామ రైతు పెంకి గౌరిశ్వరరావును శనివారం రాత్రి చినజీయర్ స్వామి ఘనంగా సన్మానించారు. విశాఖపట్నం ఎయు కన్వంక్షన్ సెంటర్‌లో వికాస తరంగణి ఆధ్వర్యంలో చిన్న జీయర్ స్వామి వారు దుశ్శాలువాను ఆయనకు కప్పి సత్కరించారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ప్రకృతి సేద్యం రైతులను, రిటైర్డు జెడి లక్ష్మీనారాయణతో పాటు, గౌరిశ్వరరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగణి అధ్యక్షుడు టీటీవీ రమణ మూర్తి, ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రసాద్ రెడ్డి, పెంకి చైతన్య కుమార్, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, విద్యార్థులు రసాయన ఎరువులు వాడమని తెలియజేయాలని, ప్రకృతి వ్యవసాయం చేసి ఈ భూమిని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.

యువగళం 1000 కి.మీ. విజయోత్సవ వేడుకలు

విశాలాంధ్ర -జామి : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపట్టిన యువ గళం పాదయాత్ర ఆదివారం నాటికి 1000 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జామి మండల టిడిపి ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. అందులో భాగంగా 1000 కిలోమీటర్ల కేక్ ను

కట్ చేశారు. మండలంలోని 25 పంచాయతీలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు అంతా కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోలుపర్తి స్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శి వర్రి రమణ, మాజీ జెడ్పీటిసి బండారు పెద్దబాబు, సీనియర్ నాయకులు రెడ్డి పైడి బాబు, గనివాడ ఎర్నాయుడు, రాయవరపు శ్రీను, మాకిరెడ్డి సూరిదేవుడు, బండారు జగన్నాథం, ముకుంద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రఘురాజు పిలుపుతో విద్యార్థుల పరిసరాల పరిశుభ్రత

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట మండలం గోపాలపల్లి గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఆ పాఠశాల ఆవరణలో గల చెత్త, కలుపు మొక్కలను చూసిన ఎమ్మెల్సీ..అక్కడ ఆటలో నిమగ్నమై ఉన్న విద్యార్థులను ఉద్దేశించి మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని, మనల్ని చూసి మరికొందరు స్ఫూర్తిని పొంది వారు కూడా అదే విధముగా స్పందిస్తే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని, ఇందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ పిలుపునకు స్పందించిన పాఠశాల విద్యార్థులందరూ ఆదివారం తమ పాఠశాల ఆవరణలో గల చెత్తలు, కలుపు మొక్కలను సమన్వయంతో పనిచేసి పూర్తిగా తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆ పాఠశాల విద్యార్థులందరినీ అభినందించారు.

రాబోయే ఎన్నికల్లోనూ వైసీపీదే అధికారం

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: రాబోయే ఎన్నికల్లోనూ వైఎస్ఆర్ సీపీ అధికారంలోకి రావడం తథ్యమని.. మనమంతా కలిసి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. వైఎస్ఆర్ సీపీ నగర యువజన విభాగ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం సాయంత్రం కోలగట్ల నివాసంలో నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్ళారా చూసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి .. అనేక హామీలు ఇచ్చి, వాటిని అమలు చేస్తూ మాట తప్పని నేతగా నిరూపించుకున్నారని చెప్పారు. వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ నేడు దేశానికే ఆదర్శమన్నారు. నేడు గడపగడపకు తాము వెళుతున్న సమయంలో ప్రజలంతా ఈ ప్రభుత్వ హయాంలో ఆనందంగా ఉన్నామని చెబుతుండడం గర్వంగా ఉందన్నారు. 24 సంవత్సరాల వయసులోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని, 28 ఏళ్లకే ప్రధాన పార్టీకి పట్టణ అధ్యక్షుడిగా నియమితులయ్యానని.. తన పనితీరు గుర్తించే ఆ పదవిని ఇచ్చారని గుర్తు చేశారు. ఓడినా, గెలిచినా తాను ఎప్పటికీ ప్రజల మనిషినే అని చెప్పారు. పేరుకు ఎమ్మెల్యేని అయినా, అందరికీ స్వామి అన్నయ్య గానే అభిమానం సంపాదించుకున్నానని తెలిపారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా మీ అన్నయ్యగా వెన్నంటే ఉంటాడన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. కార్యకర్తలు, నాయకులే తన బలమని.. వారి అండదండలతోనే రాజకీయాలు చేస్తున్నానని తెలిపారు. యువజన విభాగం బలోపేతం కావాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు. అవినీతి, లంచగొండితనం లేని పాలన జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమన్నారు. చేసిన పనికి తాము గొప్పలు చెప్పుకోబోమని, అభివృద్ధి తమ ధ్యేయమన్నారు. విజయనగరం కార్పొరేషన్ హోదా దక్కించుకున్న తరువాత రూపురేఖలు ఎంత మారాయో.. నేడు ప్రధాన కూడళ్లలో అంతా సెల్ఫీలు దిగడమే నిదర్శనం అన్నారు. ప్రధాన కూడళ్ళు, పార్కులు అభివృద్ధి చేశామని.. ప్రజల ఆరోగ్యం కోసం నడక ట్రాకులు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎక్కడా మంచినీటి సమస్య లేదన్నారు. మహిళల కోసమే ప్రత్యేకంగా రాష్ట్రంలోనే తొలి మహిళా పార్కును నిర్మించామన్నారు. జాతీయ ప్రాజెక్టును వారి గొప్పతనంగా సెల్ఫీలు తీసుకొని ప్రకటించుకున్న వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. అవసరం ఉంటేనే బయటికి వస్తారని అశోక్ ను ఉద్దేశించి విమర్శించారు.

విజయనగరానికి జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల, మెడికల్ కళాశాల తామే తెచ్చామని, జెఎన్టియును తీసుకురావడంతో పాటు యూనివర్సిటీ గానూ మార్పు చేశామని.. వాటి దగ్గర తాము సెల్ఫీలు తీసుకోలేమా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు ఆశపు వేణు , జిల్లా యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సంగం రెడ్డి బంగారు నాయుడు, నగర అధ్యక్షులు అల్లు చాణక్య, రాష్ట్ర కార్యదర్శి జివి రంగారావు, జిల్లా యువజన విభాగం నాయకులు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, జోనల్ ఇన్చార్జులు, కార్పొరేటర్లు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు: కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర విజయనగరం : ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి.ఎస్ ఆదేశించారు. మే 3న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సిఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో, పర్యటనా ఏర్పాట్లపై కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భోగాపురం అంతర్జాతీ విమానాశ్రయం ప్రభుత్వానికి ఎంతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. సమావేశానికి హాజరైన ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా, సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులంతా తమకు అప్పగించిన విధులను సక్రమంగా, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఉదయం 10 గంటలకు సిఎం కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. బహిరంగ సభ, ఆడియన్స్ గ్యాలరీ, పార్కింగ్ తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఎండ తీవ్రత బాగా ఉన్నందున ప్రజలు ఇబ్బంది పడకుండా త్రాగునీరు, మజ్జిగ పంపిణీ చేయాలన్నారు. అనారోగ్యంతో ఉన్నవారిని సభకు తీసుకురావద్దని సూచించారు. జిల్లా ఎస్పి దీపిక మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తామని చెప్పారు. సభకు వచ్చేవారు ఇబ్బంది పడకుండా, వీలైనంత వరకు సభా ప్రాంగణానికి సమీపంలోనే పార్కింగ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జెసి మయూర్ అశోక్, డిఆర్ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంటిపేట సహకార సంఘం అధ్యక్షుడుగా బొన్నాడ సత్యనారాయణ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని అంటిపేట సహకార సంఘం అధ్యక్షుడుగా గాదెలవలసకు చెందిన బొన్నాడ సత్యనారాయణను నియమిస్తూ సహకార సంఘం ఉన్నతాధికారులు ఉత్తర్వుల జారీచేశారు. తనను సహకార సంఘం అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా నియమించిన ఎమ్మెల్యే జోగారావుకు, మండల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.బుధవారం భాధ్యతలు తీసుకుంటానని చెప్పారు. గతంలో 2013నుండి 2019వరకు కూడా తాను అంటిపేట సహకార సంఘం అధ్యక్షునిగా పనిచేసినట్లు ఆయన తెలిపారు. అందరి సహకారంతో సొసైటీని ప్రగతి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని చెప్పారు.

26న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - దత్తిరాజేరు : గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య జన్మదిన వేడుకలు ఈనెల 26న అనగా బుధవారం వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం వద్ద ఘనంగా ప్రారంభమవుతాయని నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పి నారాయణమూర్తి తెలియజేశారు. ఈ వేడుకలకు నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి ఏఎంసీ చైర్మన్, ఎంపీపీలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపీపీలు, మండల పార్టీ కన్వీనర్లు, జేసిఎస్ కన్వీనర్లు, రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి నామినేటెడ్ డైరెక్టర్లు, పిఎసిఎస్ అధ్యక్షులు, సర్పంచులు ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, అందరూ పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయాలని కోరారు.

పోరాట ఫలితమే సామూహిక మరుగుదొడ్లు నిర్మాణం

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: స్థానిక 29 వడివిజన్లో గల రామకృష్ణా నగర్లో సామూహిక మరుగుదొడ్లు ఆదివారం నుండి వినియోగం లోకి వస్తున్నట్టు సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు ప్రకటించారు. సామూహిక మరుగుదొడ్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం, ఐద్వా పోరాట ఫలితంగా నే సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం జరిగాయని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. 15 ఏళ్లుగా అనేక పోరాటాలు నిర్వహించిన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, రామకృష్ణా నగర్ కాలనీ అసోసియేషన్ పోరాట ఫలితంగా స్థానిక శాశన సభ్యులు శ్రీ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో ఎమ్మెల్యే నిధులు మంజూరు చేసి 12 షీట్లు కలిగిన సామూహిక మరుగు దొడ్లు నిర్మించారు అని అందుకు ఆయనకి కాలని అసోసియేషన్ తరుపున ధన్యవాదాలు తెలిపారు. అలాగే సామూహిక మరుగుదొడ్ల ప్రతిరోజూ నిర్వహణ కోసం ఒక స్కావింజర్ నీ ఏర్పాటు చేయాలనీ. నిత్యం మెంటినెన్స్ అయ్యే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలూ తీసుకో వాలనీ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి శాంత మూర్తి, ఐద్వా జిల్లా నాయకులు జగదాంబ, దుర్గా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వెంకంపేటలో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - పార్వతీపురం: మండలంలోని వెంకమ్మపేట సచివాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. 205వ రోజున 63వ సచివాలయం పరిధిలోని వెంకంపేటగ్రామంలో వరుసగా 3వరోజున గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహించారు. సచివాలయం, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామంలో గల గడప గడపకు వెళ్లి సీఎం వైయస్ జగన్ గారి 45 నెలల సంక్షేమ పాలనలో ప్రజలకు ప్రభుత్వం చేసిన సంక్షేమ సహాయాన్ని వివరించారు.

ఈకార్యక్రమంలో సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, మండల ప్రజాప్రతినిధులు జెడ్పీటీసీ బలగ రేవతమ్మ నాగేశ్వరరావు, ఎంపీపీ మజ్జి శోభారాణి శేఖర్, ఏఎంసి చైర్ పర్సన్ ఏం భాగ్యశ్రీ, వైస్ ఎంపీపీ సిద్ధ జగన్నాధ రావు, మండల పార్టీ అధ్యక్షులు బోమ్మి రమేష్, ఎక్స్ సర్పంచ్ తీళ్ల సుభద్రమ్మ, పిఎసిఎస్ చైర్మన్ సివున్నాయుడు, మండల వైసీపీ సీనియర్ నాయకులు కే సత్యన్నారాయణ, వి గురురాజు, ముప్వల సత్యం నాయుడు, తీళ్ల చంటి, మర్రాపు వాసుదేవరావు, వివిధ గ్రామాల సర్పంచ్లు సవరాపు రాజారావు, జక్కు ప్రవీణ్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు, స్కూల్ కమిటీ చైర్మన్ పప్పల శ్రీనివాసరావు, కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లపై అధ్యాపకుల ముమ్మర ప్రచారం

కళాశాల ప్రిన్సిపాల్ రేణుక

విశాలాంధ్ర - సీతానగరం: ప్రైవేటు జూనియర్ కళాశాలకు, కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యను అందించే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బొబ్బిలి రేణుక తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపిసి, సిఈసి సాదారణ కోర్సులతోపాటు ఓఏ, సిఈటి, ఎంఅండ్ ఏఈ, ఎంపిహెచ్ డబ్ల్యు (మహిళలు) వృత్తివిద్యా కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకులు రెండు బ్యాచులుగా ఏర్పడి ప్రతీరోజూ అడ్మిషన్లు గూర్చి ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు తెర్లి రవికుమార్, అల్లాడ రామారావునాయుడు, నవీన్ కుమార్, అచ్చేంనాయుడు, దాసరి రామకృష్ణ,అమ్మాజీ,మయూరి, ఇందిర తదితరులు ప్రతీ రోజూ గ్రామాలకు వెళ్లి ప్రవేశాలు గూర్చి ప్రచారాన్ని నిర్వహించారు. ఆధునాతన సౌకర్యాలు, లాబ్,ప్రహరీ, విశాలతరగతి గదులు, అత్యుత్తమ పలితాలు, పోటీప్రపంచానికి తగ్గ విద్యను అందించడం వంటి సౌకర్యాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నాయని ప్రిన్సిపాల్, అధ్యాపకులు తెలిపారు. ప్రతీరోజూ విధ్యార్ధుల సమచారంను తల్లిదండ్రులకు తెలియజేస్తామని చెప్పారు.ప్రభుత్వం అందజేస్తున్న విద్యాపరమైన పథకాలు అందజేయడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటామని తెలిపారు. ఇంటర్ బోర్డు అధికారులు ఉత్తర్వులు, సూచనలు, సలహాల మేరకు అడ్మిషన్లు శతశాతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ప్రవేశ పరీక్షలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ



విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని జోగమ్మపేట ప్రతిభ కళాశాలలో ఆదివారం 8వ తరగతి, ఇంటర్ మొదట సంవత్సరం ప్రవేశాలకు జరిగిన ప్రవేశ పరీక్షలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి విష్ణు చరణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహించిన తీరును నిశితంగా పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభా కళాశాలలో, పాఠశాలలో ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్షను నిర్వహించినట్లు చెప్పారు. 8వ తరగతి ప్రవేశ పరీక్షకు 153 మంది విద్యార్థులకుగాను 132 మంది విద్యార్థులు, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి జరిగిన ప్రవేశ పరీక్షకు 270 మంది విద్యార్థులకుగాను 221మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షలను డిప్యూటీ డైరక్టర్ సూర్యనారాయణ, అమరావతి నుండి విచ్చేసిన పరిశీలకులు విజయకుమార్ పరీక్షలను దగ్గరుండి పర్యవేక్షణ చేశారు.

చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా వ్యవసాయశాఖాధికారి

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలో చిరు ధాన్యాలను ప్రోత్సహించాలన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్,వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఆదేశాలు సూచనలు మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ రాబర్ట్ పాల్ తెలిపారు. ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ చిరు దాన్యాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రబీ సీజన్, ఖరీఫ్ సీజన్లో చేయాల్సి లక్ష్యాలను సాధించడానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిరు ధాన్యాలకుసంబంధించి 126 క్వింటాళ్ల విత్తనాలు కూడా జిల్లాకు కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రతీఎకరానికి సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.రైతులకు అన్ని వివరాలపై అవగాహనను రైతు భరోసా కేంద్రాల ద్వారా కల్పిస్తున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో అందించాలని ఆయన అన్నారు.రాబోయే ఖరీఫ్ సీజన్లో 30,765 క్వింటాళ్ల విత్తనాలను (అపరాలు, చోడి, వేరుశనగ, వరి) రాయితీపై ఆర్బీకేల వద్ద రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. షెడ్యూల్ మండలాల్లో గిరిజన రైతులకు 90శాతంరాయితీపై విత్తనాలు సరఫరా చేయబడునని చెప్పారు. వరిపంటలో ముఖ్యంగా MTU-1064 (అమర) రకం 12వేల క్వింటాళ్లు, RGL-2537 (శ్రీకాకుళం సన్నాలు) రకం 10వేల క్వింటాళ్లు, MTU-1121 (శ్రీధృతి) 5వేల క్వింటాళ్లు ఏపీ సీడ్స్ గోదాముల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు.మిగిలిన రకాలైన సోనా మసూరి, సాంబమసూరి, 1161 (ఇంద్ర), స్వర్ణ, నెల్లూరుసన్నాలు రకాలను మే 2 వ వారంలోగా జిల్లాలో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పచ్చిరొట్ట పంటల విత్తనాలైన జనుము, పిల్లిపెసర, జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, ఏప్రిల్ నెలాఖరులోగా ఆర్బీకేలవద్దకు తెస్తామన్నారు.రాబోయే ఖరీఫ్ సీజన్లో ఆర్బీకేల ద్వారా 20వేల టన్నుల ఎరువులను పంపిణీ చేసే లక్ష్యానికి గాను, ఇప్పటి నుండే ఆర్బీకేలకు ఎరువులను తరలించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. మార్క్ఫెడ్ గోదాముల్లో ఇప్పటికే 1100 టన్నులయూరియా, 1000 టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయని అన్నారు.

రబీ మొక్కజొన్న కోతలు ప్రారంభం అయ్యాయని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే

ప్రారంభించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి తీర్మానం ఇప్పటికే చేయడం జరిగిందన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్లో వరిరకం %మీఖ%-1121 (శ్రీధృతి) సాగును గణనీయంగా తగ్గించాలని, %మీఖ%-1224 సాగును పూర్తిగా చేపట్టవద్దని రైతులను కోరారు. జిల్లాలో వ్యవసాయశాఖద్వారా సచివాలయాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది శతశాతం ఈపంట నమోదు, 88శాతం ఈ కె వై సీ జరిగిందని, ఈ ఏడాది రెండింటిలో శతశాతం లక్ష్యంగా పెట్టుకొని చర్యలు తీసుకుంటామని చెప్పారు. విత్తన సరావర, చిరుధాన్యాల సాగు, ఎరువుల సరాపరా, డాక్టరు వైఎస్సార్ యంత్ర సేవాపథకం, కౌలు రైతులకు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, అందిస్తున్న సేవలు, డాక్టరు వైఎస్సార్ రైతు భరోసా, పిఎంకిషాన్, వైఎస్సార్ ఉచిత పంటల భీమా పథకం, సున్నా వడ్డీ రుణాలు, అధిక/అకాల వర్షాలకు రైతులకి ఇస్తున్న పంట నష్టం, ధాన్యం కొనుగోలు, పొలంబడి, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందజేస్తున్న సేవలు, భూసార పరీక్షలు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ ద్వారా చేస్తున్న కార్యక్రమాలను వివారించారు. మన్యం జిల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు అందరి సహకారంతో గత ఏడాది కాలంలో గణనీయ అభివృద్ధి సాధించడం జరిగిందన్నారు. గత ఏడాది జిల్లాలో వరి పంట దిగుబడి ఎక్కువరావడం, సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడం, ధాన్యం డబ్బులు సకాలంలో జరగడం వల్ల అందరిలో ఆనందం కలిగించిందని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

పార్వతీపురం డీఎస్పీ సుభాష్



విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు మేరకు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిదిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై, మద్యంతాగి వాహనాలు నడిపిన వారిపై కొరడా ఝులిపించి కేసులు నమోదు చేస్తున్నట్లు సబ్ డివిజన్ పోలీస్ సూపరింటెండెంట్ ఏ.సుభాష్ తెలిపారు.గత పదిరోజులుగా ఓపెన్ డ్రింకింగ్ పై ప్రదాన దృష్టి సారించామని పార్వతీపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారి ఏ. సుభాష్ తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అదేశాలు, సూచనలు, సలహాలను పాటిస్తూ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లో కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లో ప్రతీ రోజూ కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.గత 10రోజులుగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై పెద్ద ఎత్తున కేసులు నమోదు చేశామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నది తెలుసుకోవాలన్నారు.దీంతోపాటు ప్రతీ పోలీస్ స్టేషను పరిదిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కూడా పెద్దఎత్తున నమోదు చేయాలని అదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. దీంతోపాటు సబ్ డివిజన్ పరిధిలోని ప్రమాదాలు నివారణకు కూడా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రీయ రహదారిపై నిరంతర పర్యవేక్షణ, వాహనాల ముమ్మర తనిఖీలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన, మైనర్లకు వాహనాలను ఇస్తే వారికి, వారితల్లిదండ్రులకు అవగాహన, దిశ యాప్ నమోదు, వాహనదారులు అన్నిరకాల ధృవీకరణపత్రాలు కలిగి ఉండాలని, గతంలో విధించిన అపరాధ రుసుములను కట్టించడం తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రమాదాలు నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నిర్ణీత ప్రయాణికులతో వెళ్ళే విధంగా ఆటో వాహనదారులకు అవగాహన కూడా కల్పించడం జరుగుతుందన్నారు..గ్రామాలలో ఏ సంఘటన జరిగిన వెంటనే వెంటనే స్పందిస్తూ పోలీస్ శాఖ వరంగా పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ అదేశాలు అమలుకు నిరంతరం అప్రమత్తంగా ఉండి పార్వతీపురం సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రకృతి ప్రసాదించిన సంజీవని

'కొబ్బరి బొండాం'!

శరీరానికి మేలు చేసే 'పుచ్చకాయ'

విశాలాంధ్ర - శృంగవరపుకోట : అధిక ఉష్ణోగ్రతతో కూడిన ఎండలు దంచేస్తున్నాయి. ఎండవేడిమి వల్ల కొందరికి చేటు కలుగుతుంది. శరీరంపై పొక్కులు, ఉక్కపోత, గాలి ఆడని స్థితి, మితిమీరిన దాహం, తలతిరుగుతున్నట్టు అనిపించడం, శరీరం శక్తిని కోల్పోవడం జరుగుతుంటాయి. వీటన్నింటినీ అధిగ మించాలంటే..ఒంట్లో శక్తి సన్నగిల్లనివ్వకుండా ఎప్పుడూ మంచినీళ్లు తాగుతూ ఉండాలి. అయితే ప్రకృతి ప్రసాదించిన సంజీవని 'కొబ్బరి బొండాం'. కొబ్బరి నీళ్లు ఎన్నో విధాలుగా మంచిని చేస్తాయి. కొబ్బరి నీళ్లలో ఖనిజ లవణాలతో పాటు వేడి నుంచి శరీరాన్ని చల్లబరిచే గుణం ఉంది.

రక్తంలోని ఎలక్ట్రోలైట్ స్థాయిని క్రమబద్ధీకరిస్తాయి. కొబ్బరినీళ్లలో పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం వంటివి సమృద్ధిగా లభిస్తాయి. వేసవి ఎండలు భగభగమండుతుండటంతో ఒంట్లోని నీరంతా చెమట రూపంలో బయటకు నెట్టివేయబడుతుంది. దాంతో ఒంట్లో నీరసం ప్రారంభమవుతుంది. ఆకలి, దప్పిక ఎక్కువుగా ఉంటాయి. ఇలాంటి సమయంలో నీటిని సమృద్ధిగా తీసుకోవడంతో పాటు పుచ్చకాయ ముక్కలు తింటే ఒంటికి చాలా మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నీరు సమద్ధిగా లభించే కొబ్బరి బొండాలు తీసుకుంటే మరింత మంచిది.

- పుచ్చకాయతో మేలైన ఆరోగ్యం...

పుచ్చకాయలో చక్కని కేలరీలను శరీరానికి అందజేయటంతో పాటు విటమిన్ సి, విటమిన్ ఎతో పాటు కాంపౌండ్లను, మినరల్స్ను కలిగి ఉంటుంది. పుచ్చకాయను ఆహారంగా తీసుకుంటే కిడ్నీ కారక వ్యాధులను, అధిక రక్తపోటు, క్యాన్సర్ల నుండి రక్షిస్తుంది. ఇది ఎక్కువగా నీటి సాంద్రతను కలిగి ఉండటం వల్ల శరీరానికి చక్కని పోషకాలతో కూడిన ద్రవాలను అందజేయటంతో పాటు శరీరాన్ని చల్లబరిచే గుణాలను కలిగి ఉంది. అలాగే కాలానుగుణంగా లభ్యమయ్యే అన్ని రకాల పండ్లను భుజిస్తే శరీరానికి అవసరమయిన అన్ని రకాల విటమిన్లు, మినరల్స్, పొటాషియం, మెగ్నీషియం వంటివి అందటంతో చక్కని ఆరోగ్యం మీ సొంతమవుతుంది. పుచ్చకాయ రసంలో తేనె కలుపుకుని సేవిస్తే శారీరక నీరసం తగ్గి శక్తినిస్తుంది. మలబద్ధకం అంతరిస్తుంది. ఎండిపోయే పెదవులను తడిగా ఉంచుతుంది. పుచ్చకాయలో ఉన్నన్ని నీళ్లు మరే పండులో గానీ, కాయలో గానీ లేవు. మూత్రం సరిగ్గా రానివారు, మూత్ర విసర్జనలో మంట ఉన్నవారికి పుచ్చకాయ ముక్కలు తింటే చక్కని ఉపశమనం కలిగిస్తుంది.

చంద్రబాబును సీఎం చేయడానికి శ్రమిస్తా: వాడాడ

విశాలాంధ్ర - బలిజిపేట: టీడీపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును రానున్న సాధారణ ఎన్నికలలో ముఖ్యమంత్రిగా చేసేందుకు అహర్నిశలు కార్యకర్తగా పనిచేస్తానని, నియోజకవర్గంలో కూడా టీడీపీని గెలిపించడమే తనప్రధానలక్ష్యమని టీడీపీ నాయకుడు వాడాడ రాము తెలిపారు. పార్టీఅదేశాలు, నియోజకవర్గ ఇంచార్జి, నియోజకవర్గ పార్టీపెద్దలు సూచనలు మేరకు మండలంలో అన్ని పార్టీ కార్యక్రమాలలో పాల్గొని రెగ్యులర్ గా చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ అదేశాలు తనకు శిరోధార్యమని, నిరంతరం సైనికుడువలే టీడీపి బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు,రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ పార్టీ పెద్దలు సూచనలు, సలహాలను పాటించి రానున్న సాధారణ ఎన్నికలలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసేంతవరకు నియోజక వర్గంలో తనదైన శైలిలో కృషి చేస్తానని చెప్పారు. పార్టీ కార్యక్రమాలని విస్తృతంగా ప్రచారం చేస్తానని చెప్పారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం కార్యక్రమానికి , పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సభలకు వస్తున్న ప్రజాస్పందనచూసి రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టంగా కనిపిస్తుందన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వము అన్ని రకాల వైఫల్యం చెందినట్లు అన్నిచోట్ల అన్ని వర్గాల ప్రజలు చర్చించుకోవడం గమనార్హమన్నారు.ఇప్పటికే ప్రక్కనున్న బొబ్బిలి నియోజక వర్గంలో టీడీపి గెలుపు ఖాయమని, బేబీనాయన ఎమ్మెల్యే కావడం ఖాయమని ప్రజలంతా చెప్పు కోవడం పరిశీలిస్తే టీడీపీ జోష్ స్పష్టంగా కనిపిస్తుందన్నారు.